ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
16-01-2025
గురువారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 124 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



## సుప్రీం కోర్టులో చంద్రబాబుకు ఊరట

జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 15:

సుప్రీం కోర్టులో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఊరట లభించింది. స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బేలా త్రివేది ధర్మాసనం కొట్టి వేసింది. ఈ కేసులో ఇప్పటికే ఛార్జిషీట్ ఫైల్ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి కోర్టుకు వెల్లడించారు.ఛార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు జస్టిస్ బేలా త్రివేది . గత ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీం కోర్టు సూచించింది. 2023 నవంబరులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ఇంటర్ లొకేటరీ అప్లికేషన్ దాఖలు చేసిన స్వర్ణాంధ్ర పత్రిక విలేకరి బాల గంగాధర్ తిలక్‌పై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరెవరు..? మీకేం సంబంధం..? పిల్ దాఖలు చేయడానికి ఉన్న అర్హత ఏంటి..? అని ప్రశ్నించింది. బెయిల్ వ్యవహారాల్లో మూడో వ్యక్తి ఎందుకు ఉంటారని ధర్మాసనం నిలదీసింది. సంబంధం లేని బెయిల్ వ్యవహారాల్లో పిటిషన్ ఎలా వేస్తారని జస్టిస్ బేలా త్రివేది ఆగ్రహం వ్యక్తం చేశారు.



## కేటీఆర్ కు సుప్రీంలో దక్కని రిలీఫ్

జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 15:

ఫార్ములా ఈ రేస్ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు బిగ్ షాక్ తగలింది. హైకోర్టు ఆదేశాలో తాము ఎలాంటి జోక్యం చేసుకోబోమని తేల్చి చెప్పేసింది. దీంతో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను విత్ డ్రా చేసుకున్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ ఏ1 నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే.అయితే.. ఇవాళ విచారణ సందర్భంగా సెక్షన్ 13(1)పై వాదనలు వినిపించారు. అవనితీ నిరోదక చట్టం సెక్షన్ 13(1) వర్తించదంటూ కేటీఆర్ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. 54కోట్లు పొందిన సంస్థ నిందితుల జాబితలో లేదని అన్నారు. డబ్బు చెల్లించడం అవినీతి ఎలా అవుతోందని.. చేయాలనుకుంటే కేటీఆర్‌ను అరెస్ట్ చేసుకోండి అంటూ న్యాయవాది మాట్లాడారు. అయితే గురువారం కేటీఆర్ ఈడీ ముందు హాజరు కానున్నారు.ఏసీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని హైకోర్టులో కేటీఆర్ ఇటీవల పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీంతో ఈ నెల 8న కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషిన్ దాఖలు చేశారు. కేటీఆర్ పిటిషన్ పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లె ధర్మాసనం విచారణ జరిపింది. మరోవైపు ఇప్పటికే సుప్రీంకోర్టులో తెలంగాణ గవర్నమెంట్, ఏసీబీ కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది.

అఖండ భారత్ అడుగులు

2 లో




# సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

## ఏఐసీసీ కార్యాలయం ప్రారంభం

జయభేరి, న్యూఢిల్లీ :

కాంగ్రెస్ పార్టీకి 140 ఏళ్ల చరిత్ర ఉందని ఆ పార్టీ ఏ స్వార్థం లేకుండా దేశం కోసం పని చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అంత ఘన చరిత్ర ఉన్న ఈ పార్టీ దళితులు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమంతోపాటు అభివృద్ధి కోసం పాటు పడిందని ఆయన గుర్తు చేశారు. ఇన్నేళ్లు దేశాన్ని నడిపిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోందన్నారు. బుధవారం న్యూఢిల్లీలో ఏఐసీసీ నూతన కార్యాలయాన్ని ఆ పార్టీ అగ్రనేతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. నిన్న కాకుండా మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలతో పాటు బీజేపీ సైతం పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయని గుర్తు చేశారు. అలాగే ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు ఏ విధంగా ఉన్నాయో పరిశీలించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు కోసం ఇకపై ఈ కార్యాలయం వేదికగా ప్రణాళికలు రచించబోతున్నామని జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో పేద ప్రజలందరికీ ఇక్కడి నుంచే దశ దిశ నిర్ధారిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలోనే మేటి దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దేందుకు విధి విధానాలు రూపొందిస్తామన్నారు. దేశ ప్రజలకు ఇది పండగ రోజు అని ఆయన అభివర్ణించారు. దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన పార్టీ కాంగ్రెస్ ఈ రోజు అద్భుతమైన కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుందని తెలిపారు. దేశ ప్రజల ప్రయోజనానికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఒక వేదిక కాబోతుందన్నారు.
బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. అలాగే రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు పలువురు కేంద్ర మంత్రుల అపాయింట్మెంట్ కోరామన్నారు. అపాయింట్ మెంట్ వచ్చిన వెంటనే వారిని కలిసి. తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తామన్నారు.

## డిప్యూటీ సీఎం గా నారా లోకేష్..!




జయభేరి, అమరావతి :

ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మూడు పార్టీల కూటమి ప్రభుత్వంలో త్వరలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తుంది, ప్రస్తుతం ఏపీలో డిప్యూటీ సీఎం హోదాలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఉన్నారు. అయితే సీఎం చంద్రబాబు పై పార్టీ ముఖ్యులతోపాటు నందమూరి కుటుంబం నుంచి కొత్తగా డిమాండ్ వస్తుంది. పవన్ కళ్యాణ్ తో పాటు లోకేష్ కు సమాన హోదాపై ఒత్తిడి

## అమృత స్నానం పోటెత్తిన భక్తజనం



జయభేరి, లక్నో, జనవరి 15:

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో ప్రపంచంలోనే అతిపెద్ద అధ్యాత్మిక వేడుక మహాకుంభ మేళా సోమవారం ఉదయం పుష్య పూర్ణిమ స్నానంతో మొదలైంది. పన్నెండేళ్లకు ఒకసారి జరిగే ఈ కుంభమేళా 45 రోజులు పాటు కొనసాగనుంది. తొలిరోజు సాయంత్రం 6గంటల వరకు 1.65కోట్ల మంది భక్తులు త్రివేణీ సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం పేర్కొంది. అయితే, కుంభమేళాలో రెండోరోజు అమృత స్నానం కోసం భక్తులు పోటెత్తారు.కుంభమేళాలో మొదటి అమృత స్నానం మకర సంక్రాంతి శుభసందర్భంగా జరగనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దీంతో తెల్లవారు జామునుంచే గంగా, యమున, అంతర్వాహినిగా భావించే సరస్వతి నదుల త్రివేణి సంగమంలో

...మిగతాది 2 లో

## హర్యానా బీజేపీ అధ్యక్షుడుపై రేప్ కేసు



జయభేరి, షిమ్లా, జనవరి 15:

హర్యానా బీజేపీ అధ్యక్షుడు మోహన్‌లాల్ బడోలిపై రేప్ కేసు నమోదయింది. ఆయనతోపాటు రాకీ మిట్టల్ (జై భగవాన్) అనే గాయకుడు తనపై సామూహిక లైంగికదాడి చేశారంటూ ఢిల్లీకి చెందిన ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2023, జూలై 3న ఈ ఘటన జరిగినట్లు యువతి పేర్కొన్నది. తన యజమాని, స్నేహితురాలితో కలిసి హిమాచల్‌ప్రదేశ్‌లోని కసౌలీకి వచ్చినప్పుడు బలాత్కారం చేశారని వెల్లడించింది. ఈ ఘటనపై గతేడాది డిసెంబర్ 13న పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. ప్రస్తుతం అది సోషల్ మీడియాలో 'తన బాస్, స్నేహితురాలితో కలిసి హిమాచల్‌ప్రదేశ్‌లోని సోలన్ జిల్లా కసౌలీకి పర్యాటకురాలిగా వెళ్లాను. 2023, జూలై 3న నిందితులిద్దరు తమకు కలిశారు. బడోలి తనను తాను ఓ సీనియర్

...మిగతాది 2 లో




## చివరికి కోడే గెలిచింది

### 3 వేల కోట్ల పైగా పందేలు

జయభేరి, ఏలూరు, రాజమండ్రి, జనవరి 15:

కోడిపందేలు, గుండాటలు, పేకాటల్లో ఎన్ని కోట్లు చేతులు మారతాయో లెక్కగట్టి చెప్పేందుకు ప్రత్యేకంగా మనుషులేం ఉండరు. కాకపోతే.. ఒక్కో బరిలో తీస్తున్న నోట్ల కట్టలు, పెడుతున్న పందేలను చూస్తే.. ఎన్ని కోట్లు చేతులు మారుతున్నాయో అంచనా వేయొచ్చు. ఈ రెండ్రోజుల్లోనే.. అంటే భోగి, సంక్రాంతికి కలిపి కనీసం వెయ్యి కోట్ల రూపాయల దాకా చేతులు మారి ఉంటాయని అంచనా

▶▶ మొదటిపేజీ తరువాయి

## అమృత స్నానం

సనాతన ధర్మంలోని 13 అఖాడాలకు చెందిన సాధువులు, రుషులు ఇవాళ పవిత్ర స్నానం ఆచరిస్తున్నారు. సనాతన ధర్మంలోని 13 అఖాడాల క్రమాన్ని మహా కుంభమేళా పరిపాలన విభాగం ఖరారు చేసింది. ప్రతి అఖాడాకు పవిత్ర స్నానాలు ఆచరించేందుకు సమయాన్ని షెడ్యూల్ చేశారు.శ్రీ పంచాయతీ అఖరా మహానిర్వాణి, శ్రీ శంభు పంచాయతీ అటల్ అఖారా తొలుత అమృత స్నానం చేశారు. రెండు అఖరాలు ఉదయం 5.15 గంటలకు శిబిరం నుంచి బయలుదేరి 6.15గంటలకు ఘాట్ వద్దకు చేరుకున్నారు. 40 నిమిషాల పాటు వీరు పవిత్ర స్నానాలు చేశారు. అనంతరం 6.55 గంటలకు ఘాట్ నుంచి బయలుదేరి వెళ్లి పోయారు. ఆ తరువాత శ్రీ తపోనిధి పంచాయతీ, శ్రీ నిరంజని అఖారా మరియు శ్రీ పంచాయతీ అఖారా ఆనంద్ ఉదయం 7.05 గంటలకు ఘాట్ వద్దకు చేరుకున్నారు. రెండు అఖారాలకు చెందిన నాగ సాధువులు 40 నిమిషాల పాటు పవిత్ర సంగమంలో అమృత స్నానం చేశారు. ఇలా.. వారికి కేటాయించిన సమయం ప్రకారం అఖారాలు ఘాట్ వద్దకు చేరుకొని పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ ట్విటర్ ఖాతాలో మహాకుంభ మేళాలో మంగళవారం తెల్లవారు జామున తీసిన కొన్ని ఫొటోలను షేర్ చేశారు. ఇది మన సనాతన సంస్కృతి మరియు విశ్వాసానికి సజీవ రూపం అని రాశారు. మకర సంక్రాంతి సందర్భంగా మహాకుంభ మేళాలో ప్రయాగ్ రాజ్ లోని త్రివేణి సంగమం వద్ద మొదటి అమృత స్నానం ఆచరించి పుణ్యం పొందిన భక్తులందరికీ అభినందనలు తెలిపారు.

## హర్యానా బీజేపీ అధ్యక్షుడుపై ..

రాజకీయ నాయకుడినని, తాను సింగర్‌ను అంటూ రాకీ పరిచయం చేసుకున్నారు. తాను తీయబోయే ఆల్బమ్‌లో నటిగా అవకాశం కల్పిస్తానని మిట్టల్, తనకు పెద్ద స్థాయిలో పరిచయాలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఇద్దరు కలిసి తమను ప్రలోభ పెట్టారు.అనంతరం తమకు బలవంతంగా మద్యం తాగించారు. నా స్నేహితురాలిని బెదిరించి పక్కకు తీసుకెళ్లారు. ఆ తర్వాత నాపై ఇద్దరూ కలిసి లైంగికదాడికి పాల్పడ్డారు. నా నగ్న చిత్రాలు, వీడియోలు తీశారు. దానిని చూపించి ఈ విషయం ఎక్కడైనా చెబితే చంపేస్తామని బెదిరించారంటూ' బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, నిందితులపై 376డీ, 506 సెక్షన్ల కింద కేసు నమోదుచేశామని సోలన్ ఎస్పీ గౌరవ్ సింగ్ తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని, ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు.

## చివరికి కోడే గెలిచింది

వేస్తున్నారు. కోడిపందేలు భోగి, సంక్రాంతి, కనుమల్లోనే కాదు.. పండక్కి వారం ముందే మొదలవుతాయి. పండగ తరువాత కూడా నడుస్తుంటాయి. ఈ లెక్కన పోయిన ఏడాది ఏకంగా 3వేల కోట్ల రూపాయలు చేతులు మారినట్టు తెలుస్తోంది. ఈసారి సంక్రాంతి సీజన్‌లో 3వేల కోట్లు దాటుతుందని అంచనా..ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో భోగి నాడే 175 కోట్ల రూపాయల పందేలు జరిగినట్టు చెబుతున్నారు. ఇక మొత్తం గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, రాయలసీమ జిల్లాల్లో జరిగే కోడిపందేలను కూడా లెక్కేస్తే.. ముక్కున వేలేసుకోవాల్సిందే. కృష్ణా జిల్లాలో అతిపెద్ద బరిగా ఉన్న అంపాపురంలో ఏకంగా 10 కోట్లకు పైన పందేలు జరిగినట్టు చెబుతున్నారు. పైగా ఈసారి ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ నాయకుల చేతుల మీదుగా కోడిపందేలు ప్రారంభమయ్యాయి. దీంతో.. చాలాచోట్ల పోలీసులు చూసీచూడనట్టుగా వ్యవహరించారు. ఈసారి ఏపీ సరిహద్దున ఉన్న తెలంగాణ జిల్లాల్లోనూ జోరుగా కోడిపందేలు జరిగాయి. భోగికి ముందే తెలంగాణలోని ఆంధ్రా సరిహద్దుల్లో కోట్ల రూపాయలు చేతులు మారాయి.ఈసారి పందాల్లో ట్రెండ్ మార్చారు.. లక్షల విలువైన బహుమతులను సైతం ప్రకటించారు. కోడిపందేల్లో గెలిచిన వారికి మహీంద్రా థార్ కారు, బుల్లెట్ బండ్లు, యూనికార్న్ బైక్‌లను గిఫ్టులుగా ఇస్తున్నారు. పందేలు ఆడ్డానికి కోళ్లతో వచ్చిన కొందరు బైక్‌లు గెలిచి రయ్‌మంటూ ఇళ్లకెళ్లారు. అలాగని డబ్బులు ఇవ్వరని కాదు. పందెంలో గెలిచిన డబ్బులతో పాటు బైక్‌లు, కార్ కూడా గిఫ్ట్‌గా ఇస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ పందేలు జరిపిస్తే.. నిర్వాహకులకు కూడా ఎక్కువ కమిషన్ వస్తుంది. అందుకే, ఈ ప్లాన్ వేసినట్టు తెలుస్తోంది.

**బరుల వద్ద బరితెగింపు**

రాష్ట్రంలో సంక్రాంతి పండగ చాలా స్పెషల్. విదేశాలు, ఇతర రాష్ట్రాలు, నగరాలు, పట్టణాల్లో ఉన్నవారు అందరూ పండగకు సొంతూళ్లకు వస్తారు. ఘనంగా సంబరాలు చేసుకుంటారు. సంక్రాంతి సందర్భంగా కొన్ని జిల్లాల్లో కోడి పందేలు నిర్వహిస్తే.. మరికొన్ని జిల్లాల్లో ఎడ్ల పందాలు, గుండాటలు, జాతరలు నిర్వహిస్తారు. ఇక్కడిదాకా బాగానే ఉన్నా.. అసలు సమస్య ఇక్కడే వచ్చిందిపండగకు సొంతూళ్లకు వచ్చేవారిని దోచుకునేందుకు కొందరు ప్లాన్ చేశారు. ముఖ్యంగా కోడి పందాలు చూడటానికి, పందెం కాయడానికి చాలామంది ఆసక్తి చూపించారు. అలా వచ్చిన వారు అక్కడి పరిస్థితులు చూసి ఆశ్చర్యపోయారు. పందెం బరుల దగ్గర నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేశారు. అదే స్థాయిలో డబ్బులు దండుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో కోడి పందాలు నిర్వహించే ఓ చోట.. కారు పార్కింగ్ పేరిట భారీగా డబ్బులు వసూలు చేశారు. ఒక్క కారుకు రూ.200 పార్కింగ్ ఫీజు వసూలు చేశారు.

అంతేనా కోడి పందాలు నిర్వహించే బరుల దగ్గర మద్యం మొదలు.. అన్నీ లభించాయి. కానీ సాధారణ రేట్ల కంటే.. దాదాపు 10 రెట్లు ఎక్కువ వసూలు చేశారు. గ్రామాలకు దూరంగా బరులు ఉండటంతో.. వచ్చినవారు కూడా ఏమీ చేయలేక డబ్బులు సమర్పించుకున్నారు.అయితే.. ఈ వ్యవహారాన్ని వైసీపీ క్యాష్ చేసుకుంది. 'ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ వసూళ్లు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. కానీ.. కూటమి నాయకుల ఆదాయం వందల రెట్లు పెరిగింది. ఇలాంటి దోపిడీల వల్ల' అని వైసీపీ నేతలు విమర్శిస్తున్నారు. రూ.200 పార్కింగ్ ఫీజు వసూలు చేసిన టికెట్లను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఇది కాస్త వైరల్ అయ్యింది. చాలా చోట్ల కూటమి నేతలో దగ్గరుండి పందాలు నిర్వహించారని వైసీపీ ఆరోపిస్తోంది. ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జోరుగా కోడి పందాలు నిర్వహించారు.

ఈ జిల్లాల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయనే ప్రచారం జరుగుతోంది. పందాలు కాసేవారే కాకుండా.. నిర్వాహకులు భారీగా డబ్బులు సంపాదించారనే టాక్ నడుస్తోంది. పందెం గెలిచిన వారి నుంచి పర్సంటేజీలు, ఇతర దుకాణాలు నిర్వహించినందుకు వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసి బాగా కూడబెట్టుకున్నారనే ప్రచారం జరుగుతోంది.

## డిప్యూటీ సీఎం గా నారా లోకేష్..!

పెరుగు తుంది, దీంతో ఆంధ్రప్రదేశ్ లో మంత్రివర్గ విస్తరణ సందర్భంగా నారా లోకేష్ కు డిప్యూటీ సీఎం హోదా కల్పిస్తారని విస్తృతంగా ప్రచారం కొనసాగుతోంది. రానున్న నాలుగున్నర ఏళ్లు లోకేష్ నాయకత్వాన్ని పటిష్ట పర్చటానికి కీలక సమయమని, ఆ దిశగా అడుగులు వేయాలని టీడీపీ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది.అందుకే, వీలైనంత తొందరగా లోకేశ్‌ను డిప్యూటీ సీఎం చేయాలని, ఆ తరువాత సీఎం సీటును అప్పగించేం దుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రణాళికను అమలు చేసేందుకు ఇప్పటికే మంత్రాంగం మొదలయింది అయితే, డిప్యూటీ సీఎం ఒక్కరే ఉండాలని షరతు విధించిన పవన్ కల్యాణ్ ఈ పరిణామాలపై ఎలా స్పందిస్తారన్నది ఉత్కంఠగా మారింది. కూటమి ప్రభుత్వ తీరుతెన్నులను, టీడీపీ ప్రణాళికలను నిశితంగా గమనిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అందికు సమ్మతించక పోవచ్చన్నది జనసేన వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పవన్ అనే హర్డిల్‌ను అధిగమించి లోకేష్‌కు పట్టం కట్టేందుకు చంద్రబాబు ఇప్పటికే ఎత్తు గడలు వేయడం మొదలు పెట్టారని పరిశీలకులు భావిస్తున్నారు. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పట్నంలో పర్యటించిన ప్పుడు, ప్రధానితో పాటు వేదిక మీద లోకేశ్‌కు స్థానం కల్పించడం ఈ ఎత్తుగడల్లో భాగమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. డిప్యూటీ సీఎం హోదాలో పవన్ కల్యాణ్ అసర్టివ్‌గా ఉండడం, కాకినాడ పోర్టు, తిరుపతి తొక్కిసలాట వంటి ఘటనల్లో కఠినమైన వైఖరి ప్రదర్శించడం వంటి అంశాలు టీడీపీ శ్రేణులను ఆలోచనల్లో పడేసినట్లు తెలుస్తోంది.

కూటమి ప్రభుత్వంలో పవన్ స్పెషల్ ఫోర్సుగా కనిపించడం టీడీపీని ఇరకాటంలో పడేస్తోంది. దీనికి ప్రత్యామ్నాయంగా లోకేశ్‌ను ముందుకు తీసు కురావాలనే ప్రతిపాదన బలంగా వినిపిస్తోంది. టీడీపీ భవిష్యత్తు కోసం ఇది తప్పనిసరి అని కొందరు సీనియర్ నేతలు భావిస్తున్నారు.

# అఖండ భారత్ అడుగులు



ప్రపంచంలో కొత్త ట్రెండ్ మొదలయ్యింది. గత శతాబ్ధంలో పూర్వపు అవిభక్త రాజ్యాల పాలన కాదని ఎన్నో దేశాలు స్వతంత్ర దేశాలుగా ప్రకటించుకున్నాయి. అయితే, ఇప్పుడు రష్యా, చైనా.... చివరికి అమెరికా సామ్రాజ్యవాదం దిశగా అడుగులేస్తున్నాయి. రష్యా ఉక్రెయిన్‌ను సొంతం చేసుకోవాలని చూస్తున్నా... చైనా తైవాన్‌ను ఆక్రమించాలనుకున్నా... అటు, కొరియాల గొడవైనా... ఇటు, మిడిల్ ఈస్ట్ యుద్ధమైనా... స్పష్టంగా సామ్రాజ్యాలను విస్తరించుకోవాలనే ఉద్దేశం గట్టిగానే ఉంది. చివరికి అమెరికా సైతం... కెనడా, మెక్సికో, పనామా, గ్రీన్ ల్యాండ్‌లను కలుపుకోడానికి ఆసక్తిగా ఉంది. ఇటీవల, దీనిపై అమెరికాకు కాబోయే ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక, ఇప్పుడు భారత్ కూడా ఇదే దిశగా అడుగులేస్తుందా అనే సందేహం కలుగుతుంది భారత వాతావరణ శాఖ 150 ఏళ్లను పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'అవిభక్త భారతదేశం' సెమినార్‌లో పాల్గొనాలని పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో పాటు ఇతర పొరుగు దేశాలను భారతదేశం ఆహ్వానించింది. విభేదాలను పక్కనపెట్టి, భారత ఉపఖండం ఉమ్మడి చరిత్రను ఐక్యంగా జరుపుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన తొలి ప్రయత్నం ఇది. ఇందులో భాగంగా... పొరుగున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, భూటాన్, ఆఫ్ఘనిస్తాన్, మయన్మార్, మాల్దీవులు, శ్రీలంక, నేపాల్‌లకు ఆహ్వానాలు పంపారు. ఉపఖండంతో పాటు, మధ్యప్రాచ్యం, మధ్యనైరుతి ఆసియా దేశాలకు కూడా ఆహ్వానాలు పంపించారు. అయితే, పాకిస్తాన్ ఇప్పటికే తాము పాల్గొంటామని ధృవీకరించింది. ఇక, బంగ్లాదేశ్ నుండి ధృవీకరణ కోసం భారత్ వేచి ఉంది. బంగ్లాదేశ్ ఓకే అంటే

**భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ రూ.150 రూపాయల స్మారక నాణెం కూడా విడుదల చేయాలని నిర్ణయించారు.ఒకసారి, భారత వాతావరణ శాఖ చరిత్ర చూస్తే... ఈ శాఖ, జనవరి 15, 1875న స్థాపించబడింది. అయితే, దీని కంటే చాలా కాలం ముందుగానే వాతావరణ అబ్జర్వేటరీలు ఏర్పాటయ్యాయి. మొదటి వాతావరణ అబ్జర్వేటరీలను బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపించగా... కలకత్తా అబ్జర్వేటరీ 1785లో, మద్రాస్ అబ్జర్వేటరీ 1796లో, బాంబే అబ్జర్వేటరీ 1826లో ప్రారంభమైంది. ఇక, 19వ శతాబ్దం ప్రారంభంలో అనేక అబ్జర్వేటరీలను స్థాపించారు. ఇప్పుడు, ఇవి భారత ఉపఖండం అంతటా విస్తరించాయి. 1864లో వచ్చిన తుఫాను కలకత్తాను నాశనం చేసిన తర్వాత... 1866, 1871లో రెండు ఘోరమైన రుతుపవనాల వైఫల్యాల వల్ల బెంగాల్ అంతటా కరువు ఏర్పడింది. దాని తర్వాత 1875లో భారత వాతావరణ శాఖ ఉనికిలోకి వచ్చిందిబ్రిటిష్ పాలనలో అడ్మినిస్ట్రేటీవ్ రికార్డుల నిర్వహణ, డేటా విశ్లేషణ అవసరమని నిర్ణయించిన తర్వాత భారత వాతావరణ శాఖ ఏర్పాటయ్యింది.**

మాత్రం... ఈ సమావేశం ఒక చారిత్రాత్మక క్షణంగా మిగిలిపోతుంది. భారత వాతావరణ సంస్థ స్థాపన సమయంలో అవిభక్త భారతదేశంలో భాగమైన అన్ని దేశాల అధికారులు ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరుతున్నట్లు ఆహ్వానంలో పేర్కొన్నారు. ఇక, ఈ ప్రత్యేక సందర్భాన్ని గుర్తుచేసుకోడానికి భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ రూ.150 రూపాయల స్మారక నాణెం కూడా విడుదల చేయాలని నిర్ణయించారు.ఒకసారి, భారత వాతావరణ శాఖ చరిత్ర చూస్తే... ఈ శాఖ, జనవరి 15, 1875న స్థాపించబడింది.

అయితే, దీని కంటే చాలా కాలం ముందుగానే వాతావరణ అబ్జర్వేటరీలు ఏర్పాటయ్యాయి. మొదటి వాతావరణ అబ్జర్వేటరీలను బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ స్థాపించగా...కలకత్తా అబ్జర్వేటరీ 1785లో, మద్రాస్ అబ్జర్వేటరీ 1796లో, బాంబే అబ్జర్వేటరీ 1826లో ప్రారంభమైంది. ఇక, 19వ శతాబ్దం ప్రారంభంలో అనేక అబ్జర్వేటరీలను స్థాపించారు. ఇప్పుడు, ఇవి భారత ఉపఖండం అంతటా విస్తరించాయి. 1864లో వచ్చిన తుఫాను కలకత్తాను నాశనం చేసిన తర్వాత... 1866, 1871లో రెండు ఘోరమైన రుతుపవనాల వైఫల్యాల వల్ల బెంగాల్ అంతటా కరువు ఏర్పడింది. దాని తర్వాత 1875లో భారత వాతావరణ శాఖ ఉనికిలోకి వచ్చిందిబ్రిటిష్ పాలనలో అడ్మినిస్ట్రేటీవ్ రికార్డుల నిర్వహణ, డేటా విశ్లేషణ అవసరమని నిర్ణయించిన తర్వాత భారత వాతావరణ శాఖ ఏర్పాటయ్యింది. కాబట్టి, వాతావరణ పరిశీలనల సేకరణ, విశ్లేషణ ఒకే భవనంలో ప్రారంభమయ్యాయి. భారత వాతావరణ శాఖ అనే సంస్థగా దీన్ని పేర్కొన్నారు. ఇక, 1875లో ప్రారంభమైనప్పటి నుండి, ఐఎండి ప్రధాన కార్యాలయం కలకత్తాలోనే ఉంది. 1905లో దీనిని సిమ్లాకు, తర్వాత 1928లో పూణేకు... చివరికి 1944లో న్యూఢిల్లీకి తరలించారు. అప్పటి నుండి అది అక్కడే ఉంది.

అయితే, సంవత్సరాలుగా ఐఎండి ఒక సాధారణ స్థాయి నుండి ఆసియాకు ప్రముఖ వాతావరణ సూచన సంస్థగా మారింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి, ఐఎండి వాతావరణ శాస్త్రాలు, కమ్యూనికేషన్, శాస్త్రీయ ఆవిష్కరణలలో గణనీయమైన పురోగతిని సాధించింది. భారత అంతరిక్ష సంస్థ ఇస్రో స్థాపించబడినప్పుడు, దానితో సహకరించిన మొదటి వాటిలో వాతావరణ శాఖ ఒకటి. 24 గంటల వాతావరణ పర్యవేక్షణ మరియు తుఫాను హెచ్చరికల కోసం తన సొంత భూస్థిర ఉపగ్రహం INSATను ప్రయోగించిన మొదటి అభివృద్ధి చెందుతున్న దేశంగా భారతదేశం నిలిచింది. కాబట్టే భారత వాతావరణ శాఖ 150వ వార్షికోత్సవాన్ని అఖండ భారత్ ఆశకు వేదిక చేసినట్లు కనిపిస్తోంది. ఇటీవల... ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా కొత్త పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవంలో కూడా అఖండ భారత్ అంశం చర్చకు దారి తీసింది. కొత్త పార్లమెంట్ భవనంలోని ఓ గోడపై ఉన్న మ్యాప్ శతాబ్దాలకు ముందు ఉన్న భారతదేశాన్ని సూచించే విధంగా రూపొందించారు. అందులో ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉన్న తక్షశిల, మరికొన్ని రాజ్యాలు కూడా ఉన్నాయి.

ఈ మ్యాప్‌ని ట్విట్టర్‌లో షేర్ చేసిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి.. 'సంకల్పం సుస్పష్టం.. అఖండ భారత్' అంటూ ట్వీట్ చేశారు. ప్రాచీన యుగాలలో భారతీయ ప్రభావాన్ని చిత్రించాలనే ఉద్దేశంతో... వాయువ్య ప్రాంతంలోని ప్రస్తుత అఫ్గనిస్థాన్ నుంచి ఆగ్నేయ ఆసియా వరకు విస్తరించిని అఖండ భారత్ చిత్రాన్ని చెక్కారు.

# 150 శాతం పెరిగిన విమానయానం




✍ **జయభేరి, అలహాబాద్, జనవరి15:**

ప్రయాగ్‌రాజ్ ఇప్పుడు ప్రత్యక్ష.. వన్‌హాప్ విమానాల ద్వారా 20కి పైగా గమ్యస్థానాలకు కనెక్ట్ చేశారు. గత కుంభ్ సమయంలో కేవలం ఒక (ఢిల్లీ) తో పోలిస్తే, ఈ సంవత్సరం మేళాకు యాత్రికులు, ఇతర పర్యాటకులను చేర్చడంలో విమానయానం కీలక పాత్ర పోషిస్తోందని ఈక్సిగో గ్రూప్ సీఈవో అలోకే బాజ్‌పాయ్ చెప్పారు.. ఇక్సిగోలో విమాన బుకింగ్‌లలో నగరం సంవత్సరానికి 162 శాతం పెరుగుదల నమోదు చేయడంలో ఆశ్చర్యం లేదన్నారు. వారణాసి, లక్నో వంటి సమీప విమానాశ్రయాలు బుకింగ్‌లలో వరుసగా 127. 42 శాతం వృద్ధిని సాధించాయి.ఈ మహాకుంభ్ ప్రారంభ - ముగింపు వారాల్లో ప్రయాణానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుందని మేక్ మై ట్రిప్ సహ వ్యవస్థాపకుడు, గ్రూప్ సీఈవో రాజేష్ మాగో తెలిపారు. ప్రయాగ్‌రాజ్ కోసం శోధనలు సంవత్సరానికి 23 రెట్లు పెరిగినట్లు తెలిపారు.కోవిడ్ పూర్వ స్థాయిల కంటే తక్కువగా ఉన్న సమయంలో మహా కుంభ్ విదేశీ పర్యాటకుల రాకపోకలను పెంచుతుందని భావిస్తున్నారు.ఈ కుంభ్‌లో విదేశీ పర్యాటకుల సంఖ్య మునుపటి వాటి కంటే చాలా ఎక్కువగా ఉందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ ప్రెసిడెంట్ రాజీవ్ మెహ్రా పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ టూరిజం శాఖ చేపట్టిన భారీ ప్రచార కార్యక్రమం సత్ఫలితానిస్తుందన్నారు.విమానాలతో పాటు రైళ్లు కూడా మహా కుంభానికి వెళ్లే పర్యాటకులతో రద్దీగా ఉన్నాయి."ప్రయాగ్‌రాజ్ కోసం రైలు బుకింగ్‌లు సంవత్సరానికి 187 శాతం పెరిగాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, బుకింగ్‌లలో 57 శాతం సోలో ట్రావెలర్లు, 39 శాతం మహిళలు ఉన్నారు. గ్రూప్ బుకింగ్‌లు 43 శాతం ఉన్నాయి," అని ఇక్సిగో ట్రైన్స్,సీఈవో దినేష్ కుమార్ కోథా తెలిపారు.ప్రధాన మెట్రో నగరాల నుంచి ప్రయాగ్‌రాజ్, చుట్టుపక్కల విమానాశ్రయాలకు వన్‌వే విమాన ఛార్జీలు 30 రోజుల ముందుగా బుక్ చేసుకుంటే సగటున రూ. 7,00010,000 మధ్య ఉంటుంది. అయితే, భోపాల్‌ప్రయాగ్‌రాజ్ వంటి కొన్ని రూట్‌లలో అత్యధిక డిమాండ్.. పరిమిత విమాన లభ్యత కారణంగా ఛార్జీలు రూ. 17,000 వన్‌వేకి పెరిగాయి.పవిత్ర స్నానం తేదీల కంటే ముందు ప్రయాణానికి ఛార్జీలు కూడా ఎక్కువగా ఉన్నాయి . ఉదాహరణకు, ఈక్సిగో ప్రకారం, ముంబై వంటి కీలకమైన మెట్రోల నుండి జనవరి 27న నాన్‌స్టాప్ విమానాలకు వన్‌వే రూ. 27,000. ప్లాట్‌ఫారమ్ మహా కుంభ్ కోసం మైక్రోసైట్‌ను కూడా ప్రారంభించింది.. ఇందులో ప్రయాణం, వసతి ఎంపికలు, భద్రతా చిట్కాలు, ఆచారాలు, కార్యకలాపాలు.. తదితర వివరాలు ఉన్నాయి.జైపూర్, బెంగళూరు, నాగ్‌పూర్, కొచ్చి, ముంబై వంటి నగరాల నుండి ప్రయాగ్‌రాజ్‌కి విమాన ఛార్జీలు గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే దాదాపు 3 రెట్లు పెరిగాయని క్లియర్‌ట్రిప్ చీఫ్ బిజినెస్ అండ్ గ్రోత్ ఆఫీసర్ అనుజ్ రాఠీ తెలిపారు.ఢిల్లీప్రయాగ్‌రాజ్, ముంబైవారణాసి కీలకమైన ఫీడర్ రూట్‌లలో ట్రాఫిక్ పెరుగుతోందని కాక్స్ & కింగ్స్ ప్రెసిడెంట్ రామలింగం ఎస్ అన్నారు. అహ్మదాబాద్, పూణే వంటి టైర్ 2 నగరాల నుండి ఉత్తరప్రదేశ్‌లోని గమ్యస్థానాలకు అనుసంధానించే విమానాలు కూడా అధిక డిమాండ్‌తో ధరలు పెరిగాయి. విమాన ఛార్జీలు మహా కుంభ తేదీలలో 70 శాతం పెరిగాయి.ఈ మహా కుంభ్ లో 2,000 టెంట్‌లతో కూడిన మినీ సిటీకి బలమైన డిమాండ్ కనిపిస్తోందని, భక్తులు పవిత్ర స్థలంలో దగ్గరగా లీనమయ్యే అనుభూతిని కోరుకుంటున్నారని మాగో చెప్పారు.గుడారాల విషయానికొస్తే, లగ్జరీ నుండి డార్మిటరీ వరకు విస్తృత ఎంపిక ఉంది. ప్రైవేట్ సంస్థలు, కార్పొరేట్లచే నిర్వహించబడే గుడారాలు, ఇస్కాన్ (ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్) వంటి మతపరమైన సంస్థలు కూడా నిర్వహించబడుతున్నాయి.ఈ కార్యక్రమానికి ముందే.. రోజుకు 1.5 నుండి 2 కోట్ల మంది సందర్శకులు వస్తారని అంచనా వేయడంతో, అనేక రకాల వసతి ఎంపికలను అందుబాటులోకి తెచ్చినట్లు పిట్టీ తెలిపారు. ఒక టెంట్‌కి రాత్రికి 12,500 నుంచి 50,000 రూపాయల వరకు ఖర్చవుతుందని కులకర్ణి సూచించారు.అల్టిమేట్ ట్రావెలింగ్ క్యాంప్ విలాసవంతమైన గుడారాల వంటి ప్రీమియం డిగ్‌లు, ఒక రాత్రికి రూ. 1 లక్ష ధరతో, రాచరికపు స్నానపు రోజులతో సహా కీలక తేదీల కోసం ఇప్పటికే పూర్తిగా బుక్ అయ్యాయి.. ఐఆర్‌సీటీసీ మహాకుంభ్ గ్రామ్, యూపిఎస్టీడీసీ టెంట్ కాలనీ వంటి ఇతర ఎంపికలు బేసిక్ నుండి డీలక్స్ వరకు వివిధ రకాల గదులను అందిస్తున్నాయి.. వీటి ధరలు రాత్రికి రూ. 1,500 నుండి రూ. 35,000 వరకు ఉంటాయని పిట్టీ చెప్పారు.ఈ ప్రాంతంలోని లగ్జరీ హోటళ్లు రాత్రికి రూ. 11,000 నుండి రూ. 30,000 వరకు వసూలు చేస్తున్నాయి.. కొన్ని ప్రీమియం సంస్థలు రూ. 40,000 వరకు ఉన్నాయి.ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ప్రయాగ్‌రాజ్ హోటల్ బుకింగ్‌లలో 10 రెట్లు పెరిగింది.. ఇక జనవరి - ఫిబ్రవరిలో జరిగే మహా కుంభ తేదీల సమయంలో హోటళ్లు ఇప్పటికే 85 శాతానికి పైగా బుక్ అయ్యాయి.. జనవరి 13న ప్రారంభమైన మహా కుంభం ఫిబ్రవరి 26 వరకు కొనసాగుతుంది. ప్రీమియం - మిడ్‌రేంజ్ హోటళ్లు నెలల ముందే పూర్తిగా బుక్ అయ్యాయి. మిగిలిన వసతి గృహాలు కుంభం కాని నెలలతో పోలిస్తే 5060 శాతం ధరలను పెంచుతున్నాయి. సమీప నగరాలు, వారణాసి, లక్నోలకు డిమాండ్ పెరుగుతోంది. అక్కడ, హోటళ్ల బుకింగ్‌లు 4050 శాతం పెరిగాయి..45 రోజుల్లో సుమారు 40 కోట్ల మంది భక్తులు ప్రయాగ్రాజ్కు వస్తారని ప్రభుత్వ అంచనా వేసింది..ఈ నేపథ్యంలో పర్యాటక రంగం వృద్ధి మరింత పెరగనుంది.

# శామీర్ పేట్ పెద్దమ్మ కాలనీలో విషాదం

- మద్యం మత్తులో తల్లిదండ్రులపై దాడికి పాల్పడ్డ కుమారుడు.. తండ్రి మృతి, తల్లికి గాయాలు
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**జయభేరి, జనవరి 15:**






మద్యం మత్తులో విచక్షణ కోల్పోయిన ఓ వ్యక్తి తల్లి దండ్రులపై దాడికి తెగబడ్డాడు. ఈ ఘటనలో తండ్రి మృతి చెందగా, తల్లికి గాయాలయ్యాయి. ఈ దారుణ సంఘటన మేడ్చల్ జిల్లా శామీర్ పేటలో చోటు చేసుకుంది. శామీర్ పేటలోని పెద్దమ్మ కాలనీలో నివాసముంటున్న నర్సింహా (28) ట్రాక్టర్ డ్రైవర్, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని వివాహం అయినప్పటికీ భార్యతో విభేదాల కారణంగా తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటు న్నాడు. అయితే నర్సింహా మద్యానికి బానిసై తరచూ తల్లిదండ్రులతో గొడవకు దిగుతూ దాడికి పాల్పడు తుండే వాడు. ఈ క్రమంలో ఈ నెల 14 న మధ్యాహ్న సమయంలో తల్లి యాదమ్మ మరియు అతని చెల్లి మధ్య చీర విషయంలో వివాదం జరిగింది. ఈ వివాదంలో తల్లి పొరపాటున చేపల అక్వేరియంను తాకడంతో అది కింద పడి పగిలిపోయింది. దీంతో ఆగ్రహానికి గురైన మద్యం మత్తులో తల్లిపై రోకలితో పొట్ట మరియు కాళ్ళపై దాడికి తెగబడ్డాడు. దీంతో ఆమె కింద పడిపోవడంతో తండ్రి హన్మంత్ అడ్డుకునేందుకు యత్నించాడు.

ఈ క్రమంలోనే తండ్రి నుదుటి మరియు తలపై రోకలితో దాడి చేయడంతో అతను పారిపోయేందుకు యత్నించాడు. అయితే నర్సింహా (58) పక్కనే ఉన్న ఇటుకతో తలపై దాడికి పాల్పడ్డాడు. దీంతో హన్మంత్ కు తీవ్రగాయాలై నోటి నుండి మరియు చెవుల నుండి తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే యాదమ్మ 108 అంబులెన్స్ లో ఆస్పత్రికి తరలించగా వైద్యులు అతన్ని పరీక్షించి మృతి చెందినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై యాదమ్మ శామీర్ పేట పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే నర్సింహాపై కఠిన చర్యలు తీసుకోవాలని యాదమ్మ మరియు కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.



## దేవాలయ షెడ్ శంకుస్థాపనలో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

శ్రీ మహంకాళి రామ మందిర్ హబ్సిగూడ కాకతీయ నగర్ స్ట్రీట్ నెంబర్ 1లోని దేవాలయంలో నూతనంగా ఎన్నికయిన దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న షెడ్ శంకుస్థాపనకు ముఖ్యఅతిథిగా విచ్చేసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో శ్రీ మహంకాళి, శ్రీ రామ మందిర్ ఛైర్మెన్ బాబు రావు, దేవాలయ ధర్మకర్తలు విపిన్ అగర్వాల్, రమాకాంత్ రెడ్డి, రఘు, అమరవాణి, ధర్మ రాజు, రాఘవేంద్ర ప్రసాద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంది ఆగి రెడ్డి, బొపన్నపల్లి సుధాకర్ రెడ్డి, పేట మురళి ముదిరాజ్, కంది శ్రవణ్ రెడ్డి, ధర్మ నాయక్, శ్రీధర్ రెడ్డి, కృష్ణ రెడ్డి, జావేద్, నర్సింగ్ రావు, శంకర్, సాయి, శ్రవణ్ వెంకటేష్, రాఘవేందర్, కుమార్, రామకృష్ణ, విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు

- పతంగులు ఎగరేసిన కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి



**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 5 డివిజన్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి,సంక్రాంతి వేడుకలలో భాగంగా స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పతంగులు ఎగరేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మారెడ్డి మాట్లాడుతూ.. ఈ సంక్రాంతి ప్రజల జీవితాలలో కాంతులు వెదజల్లాలని,అందరూ సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్న రంగాలలో ఆదర్శవంతంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మా రెడ్డి బోడుప్పల్ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పన్నాల బుచ్చి రెడ్డి, రాజు, తిరుపతి రెడ్డి, కరుణాకర్, వెంకట్రావు, సంతోష్, మాధవ రెడ్డి, పిల్లలు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం చేసిన గ్రామ పార్టీ అధ్యక్షుడు


**జయభేరి, గజ్వేల్, జనవరి 15 :**

ఆర్అండ్ఆర్ కాలనీ సింగారం గ్రామంలో గూడూరు మల్లేశం అనారోగ్య కారణంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సింగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాలి రాములు వారి కుటుంబాన్ని పరామర్శించి ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని వారు తెలియజేశారు.

## ఘనంగా క్షేత్రగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**జయభేరి, జనవరి 15:**



శ్రీ క్షేత్రగిరి వేంకటేశ్వర స్వామి బ్రహ్మత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జాతర వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు పరిసర గ్రామాల నుంచే కాకుండా జంట నగరాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఇక ఈ వేడుకలకు తుంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి, శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్, మాజి ఎంపీటీసీ అశోక్ రెడ్డి, డైరెక్టర్ తుంకి భిక్షపతి, మాజీ వార్డు సభ్యులు కోడూరి నర్మద, వనజారెడ్డి, కుడుముల వెంకటేష్, అబ్బగౌని, అనీల్ గౌడ్ లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతీ సంవత్సరం ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సిబ్బంది పేర్కొన్నారు.

## మంత్రి పొన్నంను కలిసిన సమీర్

**జయభేరి, గజ్వేల్, జనవరి 15 :**



తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను గజ్వేల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సమీర్ ఇర్షాద్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు పేర్కొన్నారు. బుధవారం ఆయన గజ్వేల్ లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేత మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తూముకుంట యాంజాల్ లో నిర్వహించిన సంక్రాంతి ఫెస్టివల్ ఈవెంట్లో మంత్రిని కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు యువత ముందుండాలని సూచించినట్లు సమీర్ ఇర్షాద్ తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని గడపగడపలో వివరించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగరవేయనున్నట్లు మంత్రికిy హామీ ఇచ్చినట్లు సమీర్ ఇర్షాద్ పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అనిల్ రెడ్డి, గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పంజాల రవిగౌడ్, తాళ్ల రాములు గౌడ్ లు కలిసి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## తూంకుంట మున్సిపల్ పరిధిలో రేషన్ కార్డుల సర్వే

- సర్వేకు ప్రజలు సహకరించాలి - మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్



**జయభేరి, జనవరి 15:**

తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 16 నుండి రేషన్ కార్డుల సర్వే చేపట్టనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఈ సర్వే నిర్వహించనున్నట్లు, ఈ సర్వేలో వార్డు అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొంటారని ఆయన తెలిపారు. ఇక ఇప్పటికే ప్రభుత్వం నుంచి వచ్చిన జాబితా ఆధారంగా అర్హులను గుర్తించి వారి వివరాలు నమోదు చేసుకొని ప్రభుత్వానికి నివేదిస్తామనీ ఆయన వెల్లడించారు. సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కోలి సమాజాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి

- యాదగిరిని సత్కరించిన ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి



**జయభేరి, గజ్వేల్, జనవరి 15 :**

అఖిల భారతీయ కోలి సమాజ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా హైకోర్టు న్యాయవాది, నాచగిరి ఆలయ పాలకమండలి పూర్వ అధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనను గజ్వేల్ లోని తన కార్యాలయంలో సత్కరించి మాట్లాడారు. కోలీ సమాజ్ జాతీయ కార్యవర్గంలో యాదగిరికి అవకాశం కల్పించడం ఆయనకు ఉన్న చిత్తశుద్ధి, నిబద్ధత, అంకిత భావానికి నిదర్శనమని కొనియాడారు. హైకోర్టు న్యాయవాదిగా, నాచగిరి ఆలయ కమిటీ చైర్మన్ గా, బిఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ సభ్యునిగా పనిచేసిన యాదగిరి ముదిరాజ్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో అట్టడుగున నిలిచిన తన సమాజ అభివృద్ధికి విస్తృత సేవలు అందిస్తూ జాతీయ అధ్యక్షులు వీరేంద్ర కశ్యప్ కు అండగా నిలిచి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా కోలి సమాజాన్ని తీర్చిదిద్దాలని వివరించారు.

## రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

- గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, జనవరి 15 :**




ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి వాహనాలను నడిపి క్షేమంగా గమ్యస్థానాలను చేరుకోవాలని గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎస్సై కరుణాకర్ రెడ్డి సిబ్బందితో కలిసి గ్రామంలో గ్రామ ప్రజలకు, గ్రామ యువకులకు, వాహనదారులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట పోలీస్ కమీషనర్ డాక్టర్ అనురాధ ఆదేశాల మేరకు జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాల సందర్భంగా వాహనదారులకు, ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్, రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు. త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, వాహణం నడిపేటప్పుడు వాహణంకు సంబంధించిన డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగ్గుల పోటీలు



**జయభేరి, గజ్వేల్, జనవరి 15 :**

గజ్వేల్ పట్టణంలోని అర్ అండ్ అర్ కాలనీ ఎటిగడ్డ కిష్టాపూర్ గ్రామ ఏఎంసి డైరెక్టర్ వై నరసింహారెడ్డి, గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిద్దిపేట జిల్లా డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి, ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, ఏఎంసి డైరెక్టర్ వై నర్సింహారెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి,రెండవ మూడో విజేతలకు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వ్యక్తిగతంగా వేయి రూపాయల నగదు బహుమతి అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గ్రామ యువతులు పాల్గొని సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా ముగ్గులు వేయడం చాలా సంతోషకరమైన విషయం అని ఇట్టి కార్యక్రమం నిర్వహించిన సమీర్,గ్రామ యువత చెప్యాల రాజశేఖర్ రెడ్డి, కూరాకుల రమేష్, లాస్కరి సత్తయ్య, వై ప్రమోద్, అర్ కిష్టాగౌడ్ లను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగం రమేష్ గౌడ్, కర్ణకర్ రెడ్డి ఏఎంసి డైరెక్టర్, అమరేందర్ రెడ్డి, డప్పు గణేష్, రమేష్, గ్రామ యువకులు తదితరులు పాలొగొన్నారు.

## రాష్ట్ర టిపిసిసి అధ్యక్షునికి శుభాకాంక్షలు

**జయభేరి, వర్గల్, జనవరి 15 :**



సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి శుభాకాంక్షలు సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చెట్టిపల్లి అనిల్ రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పిట్ల రాజు, సల్మాన్, శ్రవణ్ రెడ్డి, నందకుమార్, ముకుంద్ రెడ్డి, మహబూబ్ తదితరులున్నారు.



## మానవత్వం చాటుకున్న బిజేపి నాయకుడు

✍ **జయభేరి, గజ్వేల్, జనవరి 15 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణం బీజేపీ సీనియర్ నాయకుడు నాగుముదిరాజ్ తమిళనాడుకు చెందిన వ్యక్తికి ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా నాగు ముదిరాజ్ మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన బీజేపీ క్రియాశీల కార్యకర్త బోరుబండిపై పనిచేస్తూ ఉన్న క్రమంలో బోర్ బండి నిర్వాహకులు అతన్ని గజ్వేల్ బైపాస్ వద్ద రోడ్డుపై వదిలిపెట్టారని తెలిపారు. తను తమిళనాడు వెళ్లడానికి దారి ఖర్చులకోసం గజ్వేల్ బీజేపీ కార్యాలయానికి రావడం జరిగిందని వారికి దారి ఖర్చుల నిమిత్తం బీజేపీ నాయకులు మనోహర్ యాదవ్, నాయిని సందీప్, బారు అరవింద్, సురేష్, బండారు మహేష్ కలిసి తమిళనాడు వ్యక్తికి దారి ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందని తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ వర్గల్ మండల నూతన కమిటీ ఎన్నిక



✍ **జయభేరి, వర్గల్, జనవరి 15 :**

వర్గల్ మండల ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మైసరాములు మరియు జిల్లా కమిటీ సభ్యులు ఆంజనేయులు మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర నాయకులు ఉప్పరపల్లి నాగభూషణం జిల్లా నాయకులు నవీన్ కుమార్ మరియు శ్రీనివాస్ బుడిగే స్వామి వర్గల్ మండల మాజీ జడ్పిటిసి పోచయ్య సమక్షంలో మండల కమిటీ ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా అవుసులపల్లి నవీన్ కుమార్ ఉపాధ్యక్షులు అంకని పోచయ్య మరియు కె వెంకట్ , ప్రధాన కార్యదర్శి కొమ్ము పరశురాములు, కోశాధికారి డ్యాగ స్వామి, కార్యదర్శులు కొమ్ము గణేష్, రామస్వామి, నాగరాజు, ప్రచార కార్యదర్శి గసిక వెంకట్ ఆనందం బురుగుపల్లి నర్సింలు అయ్యగల్ల నందకుమార్ కార్యవర్గ సభ్యులుగా అల్లాపురం స్వామి రాగట్ల పవన్ కుమార్ భాగస్వామి కర్రే సాయి ఎన్నుకునారు.

## ఎం ఆర్ పి ఎస్ పట్టణ అధ్యక్షుడిగా పొట్ట ప్రభు నియామకం



✍ **జయభేరి, దేవరకొండ :**

ఎంఆర్ పిఎస్ పట్టణ అధ్యక్షుడిగా పొట్ట ప్రభు ఎన్నికయ్యారు.ఈనెల 19న జరగబోయే విజయ గర్జన మహా ధర్నా కు మాదిగ, మాదిగ ఉపకులాలు వారు వేలాదిగా తరలి వచ్చి, ఈ దర్నని విజయవంతం చేయాలనీ పట్టణ కమిటీ తీర్మానించింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు పొట్ట ప్రభు మాట్లాడుతూ మనం పోరాటాల ద్వారానే ప్రతిదీ సాధించుకోవాలని,మనకు పోరాటాలు కొత్త కాదని అన్నారు. తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా మాదిగల అభివృద్ధికి సాయ శక్తులకు కృషి చేస్తారని అన్నారు. ఈ నెల 19న హైదరాబాదులో జరిగే మహా గర్జనకు లక్షలాది మంది మాదిగల తరలివచ్చి మహా గర్జనను విజయవంతం చేయాలని మాదిగ జాతికి పిలుపునిచ్చారు. తన ఎన్నికకు సహకరించిన జాతీయ నాయకులు కంభలపాలి వెంకటయ్య,రాష్ట్ర నాయకులు అరేకంటి యేసయ, జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గం ఇంచార్జి పొథెం సహదేవుడు, నియోజకవర్గం కన్వీనర్ ఎర్ర యాదగిరి లకు కృతజ్ఞతలు తెలిపారు.

## పుట్టినరోజు బీద కుటుంబనకు నిత్యావసరం సరుకులు అందజేత



✍ **జయభేరి, దేవరకొండ :**

పెన్షనర్స్ సంఘం దేవరకొండ సీనియర్ సభ్యులు భవానిశంకర్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తన 89వ పుట్టినరోజు సందర్భంగా సేవాసదనం నందు ఒక బీదకుటుంబం ఒంటరి మహిళకు 25కిలోల బియ్యం, నిత్యావసరం సరుకులు అందజేసినారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు, కార్యదర్శి తాడిశెట్టి నరసింహ, అంకం చంద్రమౌళి మాట్లాడుతూ మా సభ్యులు సామాజిక సేవలో పాలుగోనడం సంతోషం అన్నారు. కోశాధికారి పంగునూరు లింగయ్య దాతకు కృతజ్ఞతలు తెలిపినారు, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్ దాతకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసినారు. నిత్యావసరం సరుకులు పొందిన ఒంటరి మహిళా వెంకటమ్మ అందరికి కృతజ్ఞతలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో సహా అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి,ఆడిటర్ వనం బుచ్చయ్య, ముషిని వీరయ్య, సత్యనారాయణ పాలుగొని దాతకు శుభాకాంక్షలు తెలిపినారు.

# నాటుసారా తయారీ నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్

- ఈ నెల 16 నుంచి పతిబ్ర వరి 15 వరకు కొనసాగింపు
- 13 జి ల్లాలో 25 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక దాడులు
- స్పెషల్ డ్రైవ్‌కు సూచనలను జారీ చేసిన ఎక్సైజ్ ఎన్‌పతోర్స్
- మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి



✍ **జయభేరి, హైదరాబాద్ :**

నాటుసారాను పూర్తి స్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంలో భాగంగా మరో మారు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గతంలో మూడు నెలల్లో జరిపిన ప్రత్యేక దాడుల్లో చాల వరకు నాటుసారా తయారీ అమ్మకాలు తగ్గాయి. మిగిలిన నాటుసారా ప్రభావిత ప్రాంతాల్లో మళ్లీ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టడానికి మరో నెల గడువు తీసుకుంది. ఈ నెలరోజుల్లో చేపట్టే స్పెషల్ దాడులు చేపట్టాలని ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసుకుంది. జనవరి 16 నుంచి పతిబ్ర వరి 15 వరకు ప్రత్యేక కార్యచరణ..

నాటుసారా తయారీని పూర్తిగా నిర్మూలన దిశగా ఎక్సైజ్ శాఖ అడుగులు కదుపుతోంది. ఈ నెల 16 నుంచి పతిబ్ర వరి 15 వరకు నెల రోజుల పాటు నాటుసారా నిర్మూలన చర్యల్లో భాగంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అదేశాలను జారీ చేశారు. తెలంగాణలో 13 జి ల్లాలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న 25 మండలాల్లో నాటుసారా తయారీ అవుతుందాని గుర్తించారు. నాటుసారా తయారీ మండలాలుగా గుర్తించిన ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించడానికి ప్రత్యేక కార్యా చరణ ఏర్పాటు చేసుకోవాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులకు సర్క్యులర్లు జారీ చేశారు. ప్రధానంగా నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించడానికి అవరసరమైన కార్యచరణతోపాటు, నాటుసారా తయారీ హట్ స్పాట్‌స్‌లను గుర్తించాలని అదేశించారు. నాటుసారా తయారీ, రవాణ, అమ్మకాలతో పాటు ముడిసరుకు అక్రమ రవాణ, సప్లయర్స్, నాటుసారా తయారీ క్రిమినల్స్, నాటుసారా తయారుకు వినియోగించే బెల్లం, అలంను సరపరా చేసే నిందితుల సమాచారాన్ని సేకరించాలని అదేశాలు జారీ చేశారు. నాటుసారా ప్రభావిత స్టేషన్ల సీఐలు, ఇంచార్జీలతో పాటు డిటిఎస్, ఎస్ టి ఎఫ్ టీమ్‌ల సహకారంతో నాటుసారాను పూర్తిగా లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. నాటుసారా దాడుల్లో పోలీసుల సహకారం అవసరమున్న చోట తీసుకొని దాడులు కొనసాగించాలని అదేశించారు. ముఖ్యంగా నాటుసారా తయారీకి సరపతిరాదారుల గుట్టును రట్టు చేయడం తోపాటు వారిపై కేసులు నమోదు, దాడులు,పట్టుకున్న నాటుసారా, బెల్లం, అలం వివరాలను రోజువారిగా అంద`చేయాలని అదేశించారు. నాటుసారా తయారీ కేంద్రాలపై దాడుల పర్యవేక్షణ డిప్యూటి కమిషనర్లు, అసిస్టేంట్ కమిషనర్లు, ఏఈఎస్‌లు, సీఐలు పర్యవేక్షణలో జరుగాలన్నారు. జిల్లావారిగా గుర్తించిన నాటుసారా ప్రభావిత ప్రాంతాలు ఇవే..

మంచిర్యాల జి ల్లాలో చెన్నూర్, లక్షెట్టిపేట, బెల్లంపల్లి, వనపర్తిలో వనపర్తి, కొత్తకోట, నాగర్‌కర్నూల్ జి ల్లాలో అచ్చంపేట, తేలకపల్లి, కల్వకుర్తి, వరంగల్‌రూరల్ జిల్లాలో పరకాల, నర్సంపేట్, వర్ధనపేట, మహబూబాబాద్ జిల్లాలో తొర్రూర్, మహబూబాబాద్ గూడేరు, భూపాల్‌పల్లిలో ములుగు, కాటారం, భూపాల్‌పల్లి, నల్లగొండలో దేవరకొండ, కొత్తగూడేంలో భద్రాచలం, మహబూబ్‌నగర్, పెద్దపల్లిలో సుల్తానాబాద్, జగిత్యాలలో ధ`ర్మపురి, నిర్మల్ మండలాల్లో దాడులు నిర్వహించాలని అదేశాలు జారీ చేశారు.

## అన్నారం దర్గా ఉత్సవాలకు గిలాఫ్

- చల్లా ధర్మారెడ్డి

✍ **జయభేరి, హన్మకొండ జనవరి 15:**



రేపటి నుండి జరుగబోయే అన్నారం షరీఫ్ ఉర్సు ఉత్సవాలకు ఈరోజు పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి వారి స్వగృహం నుండి యాఖుబ్ షరీఫ్ దర్గా కు సమర్పించుటకు గిలాఫ్ చాదర్ ను జిల్లా మైనారిటీ నాయకుల ద్వారా పంపించడం జరిగింది. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి వారు మాట్లాడుతూ.. అన్నారం షరీఫ్ దర్గా మత సామరస్యానికి ప్రతీక అని ఆ దేవుడి ఆశీస్సులతో అందరు సోదరబావంతో ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు నయీమొద్దీన్, దామెర మాజీ వైస్ ఎంపిపి జాకిర్ అలి, జిల్లా మైనారిటీ నాయకులు జలాలొద్దిన్, ఇస్మాయిల్ , సంగెం మాజీ కో అప్షన్ మన్సూర్ అలి, షకీల్, సలీమ్, ఆరీఫ్, అజ్మత్, ఆబిద్, ఇక్బాల్, మహమ్మద్ ఖైరత్, అఫ్రోజ్, అమీనా బీ కరీమా బీ, ఆత్మకూరు దామెర అధ్యక్షులు సంజీవరెడ్డి, గండు రాము, పెద్దాపురం సొసైటీ చైర్మన్ బొల్లు రాజు, కొగిలివాయి ఎంపిటిసి కిరణ్, మాజీ సర్పంచ్ రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## టీసీఎస్ లో 40 వేల ఉద్యోగాలు


✍ **జయభేరి, హైదరాబాద్, జనవరి 15:**

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (TCS) ఈ ఏడాది 40 వేల మంది ఫ్రెషర్లను నియమించుకోవాలని యోచిస్తోంది. ఈ మేరకు ఐటీ దిగ్గజం చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ ఓ ఇంటరవ్యూలో తెలిపారు. ఆయన కంపెనీ నియామకాలు, డిమాండ్, AIఫస్ట్ ఆర్గనైజేషన్‌గా మారడం వంటి వాటి వాటిపై ఈ సందర్భంగా వివరించారు. అయితే 202425 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య 5 వేల మందికి తగ్గించినట్లు టీసీఎస్ తెలిపింది.202425 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య తగ్గినప్పటికీ, కంపెనీ వృద్ధిపై దీని ప్రభావం పడలేదన్నారు. వార్షిక ప్రాతిపదికన నియామకాలు చేపడతామని అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు ఉద్యోగుల భర్తీకి సంబంధించిన బ్యాలెన్స్ జరుగుతుంది. తద్వారా 2025లో కంపెనీ వృద్ధి రేటు గణనీయంగా పెరుగుతుందని లక్కడ్ చెప్పారు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా ఫ్రెషర్లకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వినియోగాన్ని కంపెనీ వివిధ విభాగాల్లో మరింతగా అనుసంధానం చేస్తోందని, ఈ0, ఈ1, ఈ2, ఈ3 వంటి అన్ని స్థాయిల్లో ఇది చాలా ముఖ్యమైన నైపుణ్యమని లక్కాడ్ తెలిపారు. అందుకే టీసీఎస్ సంస్థలో ఉద్యోగం పొందాలనుకునే వారు కేవలం కోడింగ్ నైపుణ్యాలు మాత్రమే కాకుండా వాటికి తగిన విద్యార్హత కూడా ఉండాలని ఆయన వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల ఉద్యోగుల సామర్థ్యం మెరుగుపడుతుందని, అంతేగానీ ఎవరి ఉద్యోగాలు పోవని స్పష్టం చేశారు. ముఖ్యంగా క్లయింట్ ఫేసింగ్, నాలెడ్జ్ఇంటెన్సివ్ విభాగాల్లో ఏఐ కంటే మనుషుల సేవ భర్తీ చేయలేనిదని అన్నారాయన.ఎంట్రీ లెవెల్ ఈ0లో లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎమ్‌లు), వాటి అప్లికేషన్‌లపై ప్రాథమిక అవగాహన ఉండే వారు ఈ విభాగంలోకి వస్తారు.

ఈ1 లెవెల్‌లో ఉద్యోగులు LLM APIలతో పని చేయగలగాలి. ఇది ప్రాంప్ట్ ఇంజనీర్‌లకు సమానమైన నైపుణ్యం.ఈ 2 స్థాయిలో TCS GenAI సాధనాలను ఉపయోగించడంలో నైపుణ్యం కలిగి ఉండాలి. ఈ 3 అంతకంటే ఎక్కువ స్థాయిలలో ఏఐలో నైపుణ్యం, అవగాహన కలిగిన వారు, దాని అప్లికేషన్లలను అన్ని విభాగాల్లో ఉపయోగించేవారిని డీఫాల్ట్‌గా తీసుకుంటుంది.




# కాంగ్రెస్ కొత్త కార్యాలయం ప్రారంభం





✍ **జయభేరి, న్యూఢిల్లీ, జనవరి 15:**

గత 47 ఏళ్లుగా దేశ రాజధాని ఢిల్లీలోని 24 అక్బర్ రోడ్ లో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయం చరిత్ర నేటితో ముగిసింది. కాంగ్రెస్ పార్టీ తన కొత్త జాతీయ కార్యాలయాన్ని కోట్లా రోడ్ లోని 9ఏ ప్లాట్ వద్ద నిర్మించిన ఇందిరాగాంధీ భవన్ లో ప్రారంభించింది. ఈ కొత్త కార్యాలయం ఆవిష్కరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, ఇతర సీనియర్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమానికి సుమారు 400 మంది హాజరయ్యారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపి కాంగ్రెస్ అధ్యక్షురాలు వై ఎస్ షర్మిల, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రారంభోత్సంలో జాతీయ జెండా ఆవిష్కరించి, వందే మాతరం గీతాన్ని ఆలపించారు.

**కొత్త కార్యాలయం ప్రత్యేకతలు**

ఈ కొత్త భవనానికి ఇందిరాగాంధీ భవన్ అనే పేరు పెట్టడం ద్వారా కాంగ్రెస్ పార్టీ చరిత్రలో ఇందిరాగాంధీ స్థానం ఎంతో విశిష్టమైందని నాయకులు గుర్తుచేసుకున్నారు. 5 అంతస్తులుగా నిర్మించిన ఈ కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ పరిపాలనా, వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మితమైంది.

**అంతస్తుల కేటాయింపు**

**ఐదో అంతస్తులో** మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ,రాహుల్ గాంధీకి ప్రత్యేక కార్యాలయాలు.

**నాలుగో అంతస్తు:** కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శుల కోసం.

**మూడో అంతస్తు:** రాష్ట్ర ఇంచార్జుల కోసం.

**రెండో అంతస్తు:** ఏఐసీసీ కార్యదర్శులకు కేటాయించారు.

పైగా కొత్త కార్యాలయంలో మీడియా ప్రతినిధులకు గ్రౌండ్ ఫ్లోర్ వరకే అనుమతి ఉంది. బిజేపీ ప్రధాన కార్యాలయంలో కూడా ఇలాంటి విధానమే ఉండడం గమనార్హం.

కొత్త కార్యాలయం నిర్మాణం వెనుక కారణాలు 20052006లో, సుప్రీంకోర్టు ఒక కీలక ఆదేశం జారీ చేసింది. రాజకీయ పార్టీలు తమ కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లో కలిగి ఉండకూడదని నిర్దేశించింది. ఆ తరువాత, కాంగ్రెస్ పార్టీ 2009లో కొత్త కార్యాలయం నిర్మాణం చేయాలని భావించింది. అప్పటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ చేతుల మీదుగా కొత్త కార్యాలయం నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం జరిగింది. అయితే భవనం నిర్మాణం పూర్తి కావడానికి 15 ఏళ్లు పట్టడం విశేషం.కాంగ్రెస్ కొత్త కార్యాలయం దేశ రాజధాని ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లో నిర్మితమైంది. ఇది భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయానికి కేవలం కొద్ది దూరంలోనే ఉంది.

**కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల చరిత్ర**

24 అక్బర్ రోడ్ లో కాంగ్రెస్ పార్టీ పాత కార్యాలయం 1978 నుంచి జనవరి 15, 2025 వరకు వరకు కొనసాగింది. 1977లో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత, అప్పటి రాజ్యసభ ఎంపీ గడ్డం వెంకటస్వామి (కాక), తన అధికారిక నివాసాన్ని కాంగ్రెస్ పార్టీకి తాత్కాలిక కార్యాలయంగా అందించారు. ఈ కార్యాలయంలో ఉన్నప్పుడే.. కాంగ్రెస్ పార్టీకి ఎన్నో విజయాలు అందాయి. కానీ గత 10 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ వరుసగా మూడు సార్లు లోక్ సభ ఎన్నికల్లో ఓటమి చవిచూసింది..

**విజయాలు:** 1980, 1984, 1991, 2004, 2009 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది.

**పరాజయాలు:** 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుస పరాజయాలు.

**ఇందిరాగాంధీ భవన్: కొత్త అధ్యాయం**

ఈ కొత్త కార్యాలయం కాంగ్రెస్ పార్టీకి ప్రేరణగా నిలుస్తుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. నూతన కార్యాలయం ప్రారంభంతో, పార్టీ కార్యకలాపాలను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఇందిరా భవన్ ప్రారంభంతో, కాంగ్రెస్ పార్టీ తన చరిత్రలో మరో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. 24 అక్బర్ రోడ్ లోని విజయాల గౌరవాన్ని గుర్తుంచుకుంటూనే, ఈ కొత్త భవనం కొత్త విజయాలకు వేదిక కావాలని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

jayabheridaily.com




# పాపం ఈ హీరోయిన్..!

కొంతమంది వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలుస్తుంటే మరికొంతమంది డ్రగ్స్ కేసుల్లో, రేవ్ పార్టీ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. స్టార్ యాక్టర్స్ దగ్గర నుంచి చిన్న చిన్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ వరకు చాలా మంది ఇప్పటికే డ్రగ్స్ కేసుల్లో చిక్కుకున్నారు. అలాగే కొంతమంది బెయిల్ పై బయటకు వస్తే మరికొంతమంది నిర్దోషులుగా బయటకు వస్తున్నారు. సినిమా వాళ్ళు చాలా మంది అనుకోని కేసుల్లో ఇరుకుంటున్నారు. కొంతమంది వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలుస్తుంటే మరికొంతమంది డ్రగ్స్ కేసుల్లో, రేవ్ పార్టీ కేసుల్లో ఇరుక్కుంటున్నారు. స్టార్ యాక్టర్స్ దగ్గర నుంచి చిన్న చిన్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ వరకు చాలా మంది ఇప్పటికే డ్రగ్స్ కేసుల్లో చిక్కుకున్నారు. అలాగే కొంతమంది బెయిల్ పై బయటకు వస్తే మరికొంతమంది నిర్దోషులుగా బయటకు వస్తున్నారు. తాజాగా డ్రగ్స్ కేసులో ఇరుక్కున్న ఓ స్టార్ బ్యూటీ ఎట్టకేలకు నిర్దోషిగా బయట పడింది. కోర్టు ఆమెను నిర్దోషిగా తీర్పు ఇచ్చింది. ఇంతకూ ఆ హీరోయిన్ ఎవరో తెలుసా.? పై ఫొటోలో ఉన్న నటి ఎవరో కాదు రాగిణి . నాని కథానాయకుడిగా వచ్చిన 'జెండా పై కపిరాజు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కన్నడ నటి రాగిణి ద్వివేది. కన్నడ ఇండస్ట్రీలో ఈ ముద్దుగుమ్మ పలు సినిమాల్లో హీరోయిన్ గా చేసింది. 2020లో శాండల్‌వుడ్‌లో డగ్స్ కేసు వార్త ఒక్కసారిగా అందరినీ షాక్‌కు గురి చేసింది. నటి రాగిణి ద్వివేది సన్నిహితుడు రవిశంకర్‌ను సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ సమయంలో ఆమె చాలా రోజులు జైల్లో కూడా గడిపింది. డ్రగ్స్ కేసులో నాలుగేళ్ల తర్వాత రాగిణి నిర్దోషి అని తేలింది. వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లభించకపోవడంతో, కేసును నిర్దోషిగా విడుదల చేస్తూ హైకోర్టు ఆదేశించింది. దీంతో రాగిణి కాస్త ఉపశమనం పొందింది. డ్రగ్స్ మాఫియాతో రాగిణికి సంబంధాలున్నాయని గతంలో ఆరోపణలు వచ్చాయి. పార్టీలు నిర్వహించి డ్రగ్స్ వాడారని ఆరోపణలు రావడంతో ఆమె పై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. కానీ దీనికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో హైకోర్టు ఆమెను నిర్దోషి తేల్చింది.





# తమిళ, కన్నడలో అవకాశాలు

'బేబీ' చిత్రం కథానాయిక వైష్ణవి చైతన్య కెరీర్‌ను మలుపుతిప్పింది. ఈ సినిమాలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు వరించింది. ప్రస్తుతం సినిమాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటూ కథాబలమున్న చిత్రాలనే అంగీకరిస్తున్నది వైష్ణవి చైతన్య. ప్రస్తుతం ఈ భామ తెలుగులో సిద్ధు జొన్నలగడ్డ సరసన 'జాక్' చిత్రంలో నటిస్తున్నది. మరికొన్ని పెద్ద చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరికి తమిళం, కన్నడ ఇండస్ట్రీల నుంచి కూడా భారీ ఆఫర్లొస్తున్నట్లు తెలిసింది. అక్కడ రెండు చిత్రాలకు ఆమె సైన్ చేశారని సమాచారం. ఈ ఏడాది తెలుగుతో పాటు తమిళ, కన్నడ భాషల్లో కూడా మంచి విజయాలను సొంతం చేసుకుంటానని ధీమా వ్యక్తం చేస్తున్నది వైష్ణవి చైతన్య. సోషల్‌మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో తన సినిమాలకు సంబంధించిన విశేషాలను పంచుకుంటుంది వైష్ణవి చైతన్య. తాజాగా ఈ భామ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫొటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ కొత్త ఏడాది నటిగా తనను మరో మెట్టెక్కిస్తుందనే నమ్మకంతో ఉంది వైష్ణవి చైతన్య.

# నారీ నారీ నడుమ మురారి

హీరో శర్వానంద్ నటిస్తున్న తాజా చిత్రానికి 'నారీ నారీ నడుమ మురారి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. శర్వానంద్ నటిస్తున్న 37వ చిత్రమిది. సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్‌లుక్‌ను అగ్ర నటులు బాలకృష్ణ, రామ్‌చరణ్ విడుదల చేశారు. 'ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. శర్వానంద్ పాత్ర గత చిత్రాలకు భిన్నంగా ఉంటుంది. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కించబోతున్నాం' అని మేకర్స్ తెలిపారు. సాక్షి వైద్య, సంయుక్త కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్, కథ: భాను భోగవరపు, సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, నిర్మాణ సంస్థలు: ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రామ్ అబ్బరాజు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com